# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అమెరికన్లు

## (04 జూలై "అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం" సందర్భంగా)

ఇంగ్లాండ్ పాలనలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలు చేపట్టిన అమెరికన్ విప్లవ పోరాటం ఫలితంగా 04 జూలై 1776న స్వాతంత్ర్య పొంది స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవడం జరిగింది. ఈ మహోఘట్టాన్ని పురస్కరించుకొని 04/05 జూలై రోజున అమెరికాలోని 50 రాష్ట్రాలు సెలవు దినాన్ని పాటిస్తూ, 1812లో జరిగిన యుద్ధం అనంతరం "యూఎస్ ఇండిపెండెన్స్ డే" లేదా "అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం" ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. 1870 తర్వాత స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించబడింది. ఈ ఉత్సవాల్లో భాగంగా కవాతులు, వినోద కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, క్రీడలు, కుటుంబ కలయికలు, బాణాసంచా వెలుగులు, విహార యాత్రలు లాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొంటారు. 1776కు పూర్వం అమెరికాకు చెందిన 13 కాలనీలు బ్రిటీష్‌కు చెందిన కింగ్ జార్జ్-3 చక్రవర్తి పాలనలో ఉండేవి. అమెరికన్ల స్వాతంత్ర్య పోరాట ఫలితంగా 02 జూలై 1776న స్వాతంత్ర్య ప్రకటన చేసినప్పటికీ 04 జూలైన మాత్రమే సంతకాలు చేయడంతో అదే రోజున అమెరికన్లు తమ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

యూఎస్ జాతి పిత 'జార్జ్ వాషింగ్టన్:

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ చక్రవర్తి పాలనలో అమెరికన్లు దుర్భరమైన బానిస బతుకులు గడపడంతో జార్జ్ వాషింగ్టన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు జరగాలని చరిత్ర స్పష్టం చేస్తున్నది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత అమెరికన్లు తమదైన రాజ్యాంగంతో తొలి అధ్యక్షుడిగా 1789 - 97 మధ్య జార్జ్ వాషింగ్టన్ ఎంపిక కావడం, పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో జార్జ్ వాషింగ్టన్‌ను "అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతి పిత (ఫాదర్ ఆఫ్ యూఎస్)"గా గౌరవం ఇవ్వడం జరిగింది. తనకంటూ ఒక రాజ్యాంగం లేకుండానే 1776 నుంచి 1789 వరకు ఎనిమిది మంది అధ్యక్షులుగా సేవలు అందించినప్పటికీ 1987లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగ రచన కమిటీకి జార్జ్ వాషింగ్టన్ చైర్మన్‌గా వ్యవహరించి ప్రధాన భూమిక నిర్వహించారు. స్వాతంత్ర్యం పొందిన అమెరికాకు 47వ అధ్యక్షుడిగా నేడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద రీతుల్లో సేవలు అందిస్తున్నారు. జార్జ్ వాషింగ్టన్ ప్రభుత్వం 1792లో వైట్ హౌజ్ నిర్మాణం ప్రారంభించగా 1800లో జాన్ ఆడమ్స్ అధ్యక్షుడి కాలంలో పూర్తి కావడం, పాలనకు అందుబాటులోకి రావడం జరిగింది.

నేడు 249వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న అమెరికన్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేద్దాం.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జూలై 6,7 తేదీల్లో రియో డి జనీరోలో ఏర్పాటైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి నేను హాజరవుతాను-ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 3:దేశవాసులారా.. జులై 2 నుంచి 9వ తేదీ వరకూ నేను అయిదు దేశాల పర్యటనలో ఉంటాను. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల పర్యటన ఈరోజు ప్రారంభమవుతుంది.

అధ్యక్షుడు శ్రీ జాన్ డ్రమని మహామా ఆహ్వానం మేరకు 2,3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తాను. అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాల్లో కీలక భాగస్వామి అయిన ఘనా.. ఆఫ్రికన్ యూనియన్, పశ్చిమాఫ్రికా దేశాల ఆర్థిక కూటమిలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. చారిత్రికంగా ఇరు దేశాల మధ్య గల సంబంధాల బలోపేతం సహా సహకారం మరిన్ని రంగాలకు విస్తరించగలదని ఆశిస్తున్నాను. పెట్టుబడులు, ఇంధనం, ఆరోగ్యం, భద్రత, సామర్థ్య పెంపు, అభివృద్ధి భాగస్వామ్య రంగాల్లో సహకార అవకాశాలను చర్చించేందుకు ఆసక్తితో ఎదురు చూస్తున్నాను. ప్రజాస్వామ్య దేశమైన ఘనా పార్లమెంటులో ప్రసంగించే అవకాశాన్ని నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

చారిత్రకంగా బలమైన సాంస్కృతిక సంబంధాలు, ఇరు దేశ ప్రజల మధ్య స్నేహమూ గల ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశంలో జులై 3,4వ తేదీల్లో పర్యటిస్తాను. ఈ సంవత్సరం జరిగిన ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి, గౌరవనీయ క్రిస్టీన్ కార్లా కంగాలూ... ఇటీవలే రెండో సారి ప్రధానమంత్రి పదవి చేపట్టిన శ్రీమతి కమలా పెర్సాద్- బిస్సెస్సర్ లతో నేను సమావేశమవుతాను. భారతీయులు 180 ఏళ్ళ కిందట తొలిసారి ట్రినిడాడ్ అండ్ టొబాగోలో అడుగు పెట్టారు. ఇటువంటి ప్రత్యేకమైన వారసత్వ బంధాలను, ఆత్మీయతను పునరుద్ధరించుకునే అవకాశం ఈ పర్యటన కల్పిస్తుంది.

తదనంతరం, పోర్ట్ ఆఫ్ స్పెయిన్ నుంచి బయలుదేరి బ్యూనస్ ఎయిర్స్ చేరుకుంటాను. 57 ఏళ్ళ అనంతరం భారత ప్రధాని అర్జెంటీనా దేశానికి చేపడుతున్న ద్వైపాక్షిక పర్యటన ఇది. లాటిన్ అమెరికా ప్రాంతంలో అర్జెంటీనా ముఖ్యమైన ఆర్థిక భాగస్వామి మాత్రమే కాక, జీ-20 కూటమిలో కూడా కీలక సభ్య దేశం. అధ్యక్షుడు శ్రీ జేవియర్ మిలేతో జరిపే చర్చలు కోసం ఎదురు చూస్తున్నాను. ఈ సందర్భంగా గత సంవత్సరం అధ్యక్షుడితో సమావేశమవడం గుర్తుకు వస్తోంది. ఇరు పక్షాలకూ ప్రయోజనం చేకూర్చే సంబంధాల బలోపేతం సహా వ్యవసాయం, కీలక ఖనిజాలు, ఇంధనం, వాణిజ్యం, పర్యాటకం, సాంకేతిక, పెట్టుబడి రంగాల్లో సహకారాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళగలమని ఆశిస్తున్నాను.

జూలై 6,7 తేదీల్లో రియో డి జనీరోలో ఏర్పాటైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి నేను హాజరవుతాను. ఆర్థికంగా పైకెదుగుతున్న దేశాల మధ్య సహకారం పెంపొందించే వేదికగా బ్రిక్స్ పాత్రను గుర్తెరిగిన భారత్, వ్యవస్థాపక దేశంగా తన నిబద్ధతను మరోసారి చాటుతోంది. శాంతి, న్యాయం, ప్రజాస్వామ్య విలువలు నెలకొన్న నిష్పక్షపాత, సమాన అధికారాలు గల ప్రపంచ నిర్మాణం ఆశయంగా సభ్య దేశాలు కృషిని కొనసాగిస్తాయి. ఇక, సమావేశాల నేపథ్యంలో నేను పలు ప్రపంచ నేతలతో సమావేశమవుతాను. ఆరు దశాబ్దాల వ్యవధి తరువాత భారత ప్రధాని చేపట్టే ద్వైపాక్షిక అధికారిక పర్యటనలో భాగంగా నేను బ్రెస్సీలియా వెళ్ళనున్నాను. బ్రెజిల్ దేశంతో గల సన్నిహిత సంబంధాల బలోపేతం కోసం నేను ఈ అవకాశాన్ని వినియోగించుకుంటాను. గ్లోబల్ సౌత్ ప్రాధాన్యాలను ముందుకు తీసుకువెళ్ళే అవకాశాలను నా మిత్రుడు, అధ్యక్షుడు శ్రీ లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వాతో చర్చిస్తాను.

వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఉమ్మడి చరిత్ర గల విశ్వసనీయ భాగస్వామి నమీబియా, ఈ యాత్రలో నా చివరి గమ్యస్థానం. గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నేతుంబో నంది-న్దైత్వాతో జరవబోయే సమావేశం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. మన ప్రజలు, మన ప్రాంతాలు, విస్తృత గ్లోబల్ సౌత్ ప్రయోజనాల కోసం సహకారం ప్రాతిపదికగా కొత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు నేను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. స్వేచ్ఛ, అభివృద్ధి పట్ల ఇరుదేశాలకు గల నిబద్ధతకు సంకేతంగా నమీబియా పార్లమెంట్ ఉమ్మడి సమావేశంలో నా ప్రసంగం ఏర్పాటవడం నాకు లభిస్తున్న గౌరవంగా భావిస్తున్నాను.

నా పర్యటన అట్లాంటిక్ మహాసముద్రానికి రెండు వైపులా గల ఈ అయిదు దేశాల పరస్పర స్నేహ బంధాలను పటిష్ఠ పరిచి, గ్లోబల్ సౌత్ దేశాల సహకార బలోపేతానికి దారితీయగలదని... బ్రిక్స్, ఆఫ్రికన్ యూనియన్, ఎకోవాస్, కారికోమ్ వంటి బహుళ ప్రయోజన వేదికల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచగలదని విశ్వసిస్తున్నాను.

# కిషన్‌రెడ్డి మాట్లాడే ప్రతి మాట.. కెటిఆర్ ఆఫీసు నుండి వచ్చే ప్రెస్‌నోటే..

### - కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ను బతికించే పనిలో కిషన్‌రెడ్డి ఉన్నారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మంగళవారం సిఎం రేవంత్ మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి మాట్లాడే ప్రతి మాట.. కెటిఆర్ ఆఫీసు నుండి వచ్చే ప్రెస్‌నోటేనని అన్నారు. "తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై మేం కిషన్‌రెడ్డి దగ్గరికి వెళ్తే.. ఆయన ఎప్పుడూ మమ్మల్ని కేంద్ర మంత్రి దగ్గరికి తీసుకుపోలేదు. మేం పోతే.. మాకంటే ముందు రోజే ఆయన మంత్రులను కలుస్తున్నారు. కిషన్‌రెడ్డి తీరు అనుమానాలు కలిగిస్తున్నాయి. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో పోరాడుతునే ఉంటాం. రాజకీయంగా, న్యాయపరంగా పోరాడుతాం" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# యజమాని తిట్టిందని.. తల్లి, కొడుకును చంపేసిన పనిమనిషి



న్యూఢిల్లీ, జులై 3: దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. తిట్టారన్న కోపంతో ఇంటి యజమానురాలిని, ఆమె చిన్న కుమారుడిని అత్యంత దారుణంగా పని మనిషి చంపేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని లజ్‌పత్ నగర్‌లోని ఓ ఇంట్లో ఇద్దరు హత్యకు గురయ్యారు. బుధవారం సాయంత్రం ఇంటి యజమాని రుచిక సెవానీ ఆమె కొడుకు.. పని మనిషిపై కేకలు వేశారు. అంతే కోపం పెంచుకుని.. రుచికను, ఆమె చిన్న కొడుకు గొంతు కోసి చంపేశాడు. అనంతరం అక్కడ నుంచి నిందితుడు పరారయ్యాడు.

బుధవారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో రుచిక భర్త కుల్దీప్ సెవానీ (ఐబీశ్రీటవవజూ ావలిజీనితి).. ఆఫీసు పని ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపు మూసి ఉండటం గమనించాడు. భార్య, 14 ఏళ్ల కుమారుడు క్రిష్‌కు ఫోన్ చేశాడు. కానీ ఇద్దరి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. కుల్దీప్ సెవానీ గేటు దగ్గర, మెట్లపై రక్తపు మరకలు గమనించాడు. భయపడి.. అతడు పోలీస్ కంట్రోల్ రూమ్ (ఖనీశ్రీతిఇ౹వ అనీనిబితీనీశ్రీ ఖీనీనీఎ) కు ఫోన్ చేసి భార్య, కొడుకు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి తలుపు పగలగొట్టి చూసేసరికి భార్య, కొడుకు విగతజీవిగా పడి ఉండడం చూసి అవాక్కయ్యాడు. రుచిక (42) మంచం పక్కన నేలపై పడి ఉంది. మొత్తం రక్తంతో నిండి ఉంది. ఇక కుమారుడు క్రిష్ పదో తరగతి చదువుతున్నాడు. బాత్రూమ్‌లో రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉన్నాడు.

రుచిక సెవానీ తన భర్తతో కలిసి లజ్‌పత్ నగర్ మార్కెట్లో బట్టల దుకాణం నడుపుతూ ఉంది. దుకాణంలో పని చేసే ముఖేష్(24)ను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరం నుంచి పారిపోతుండగా ముఖేష్ ను అదుపులోకి తీసుకున్నారు. రుచిక, ఆమె కొడుకు తిట్టినందుకే చంపేసినట్లు నేరాన్ని అంగీకరించాడు. ముఖేష్‌ది బీహార్. అమర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.

# గనుల మూసివేత, పునరుపయోగ ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు

న్యూఢిల్లీ, జులై 3:స్థానిక ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధికి బాటలు వేసే సరికొత్త కార్యక్రమం... 'రీక్లెయిమ్' కు బొగ్గు మంత్రిత్వ శాఖ శ్రీకారం చుడుతోంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి వచ్చే శుక్రవారం అంటే ఈ నెల 4న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సమగ్ర సమాజిక అభివృద్ధి విధానాన్ని బొగ్గు శాఖలో భాగమైన కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రూపకల్పన చేసింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ ఇందుకు సహకారాన్ని అందించింది. మైనింగ్ అనంతరం గనులను మూసివేయడం వల్ల భూ ఉపరితలం ప్రభావితం అవుతుంది. స్థానిక జీవనోపాధికీ ఇబ్బందులు ఏర్పడతాయి. దశాబ్దాల తరబడీ గని పరిసరాల్లో నివాసం ఉంటున్న కుటుంబాల అభ్యున్నతికి కృషి చేయాలన్నది దీని లక్ష్యం.

'రీక్లెయిమ్'గా వ్యవహరిస్తున్న ఈ విధానం.. గని మూసివేత దశలోనూ, గని మూసివేసిన తరువాతి దశలోనూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు చేపడతారు. ఈ కార్యక్రమాలకు ఇది సువ్యవస్థిత మార్గదర్శిలా పనిచేస్తుంది. అవసరమైన మార్పులూ చేర్పులూ చేయడానికి ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాల్సి ఉంటుంది.

పనులు సజావుగా సాగేందుకు వీలుగా ఆచరణాత్మక విధానాలను అనుసరిస్తారు. సత్ఫలితాలను అందించిన విధానాలను ఎంచుకుంటారు. ముఖ్యంగా భారతదేశంలోని పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకున్న క్షేత్రస్థాయిలో విజయవంతమైన వాటినే అమలు చేస్తారు. స్త్రీపురుష భేదం లేకుండా అందరూ ఇందులో పాల్గొనేందుకు ప్రాధాన్యం ఇస్తారు. బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తారు. సమానత్వానికి చోటిస్తూనే, స్థానిక అవసరాల దృష్ట్యా పంచాయితీరాజ్ వంటి స్థానిక సంస్థలతో కలిసి పనిచేస్తారు.

గని ప్రాంతాల్లో ఉన్న ప్రజల్లో నమ్మకాన్ని ప్రోది చేయడానికీ, పర్యావరణాన్ని కాపాడటానికీ, దీర్ఘకాలంలో సామాజిక-ఆర్థిక అభివృద్ధికీ ఈ రీక్లెయిమ్ కార్యక్రమాన్ని ఉద్దేశించారు.

# భారీ వర్షాలకు హిమాచల్ అతలాకుతలం.. 51 మంది మృతి

సిమ్లా జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హిమాచల్‌ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించాయి. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నదులకు వరద ప్రవాహం పెరిగింది. పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటి వరకూ 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ జూన్ 20 నుంచి జులై 2 వ తేదీ వరకూ రాష్ట్రంలో వర్షాల కారణంగా జరిగిన నష్టంపై ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదికలో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. 'ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 51 మంది మరణించారు. దాదాపు 22 మంది గల్లంతయ్యారు. మండి జిల్లాలో అత్యధికంగా 10 మంది మరణించారు. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 103 మంది గాయపడ్డారు' అని సదరు నివేదికలో వెల్లడించింది.

# కోర్టు ధిక్కారం కేసులో.. అటవీశాఖ కార్యాలయాల ఫర్నిచర్ జప్తు



ఆదిలాబాద్, జులై 3:గతంలో తాళ్ల పేట ఫారెస్ట్ రేంజు పరిధిలో పనిచేసిన దినసరి ఉద్యోగి దర్శనాల రాజంకు చెల్లించవలసిన వేతనం డబ్బులను చెల్లించినందుకు కోర్టు ధిక్కరణలో భాగంగా హైదరాబాదులోని పీసీసీఎఫ్, ఆదిలాబాదులోని సీఎఫ్, జన్నారంలోని ఎఫ్డీఓ, తాళ్లపేటలోని ఎఫ్ఆర్ఓ కార్యాలయాలలోని రూ.15,89,700.00 విలువగల ఫర్నిచర్ ను కోర్టు ఉద్యోగులు జప్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల టైగర్ రిజర్వ్ మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజనల్ ఆఫీస్ లోని, తాళ్లపేట రేంజ్ ఆఫీసులలోని ఫర్నిచర్ ను కోర్టు ఆదేశాలతో గురువారం మధ్యాహ్నం కోర్టు ఉద్యోగులు జప్తు చేశారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ వాసి దర్శనాల రాజం 1984 నుంచి దినసరి కూలీగా తాళ్ల పేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పనిచేశారు. ఆయనను వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించారు. దీనిపై ఆయన కోర్టును ఆశ్రయించడంతో బకాయి జీతాన్ని వడ్డీతో సహా చెల్లించాలని లేబర్ కోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అటవీశాఖ పాటించకపోవడంతో నేడు ఆశాఖ ఆస్తులను జప్తు చేసి లక్షెట్టిపేట కోర్టుకు తరలించారు. ఈ విషయమై స్థానిక ఎఫ్డీఓ రామ్మోహన్ ను ఫోన్లో సాయంత్రం సంప్రదించగా, గోదావరిఖని లేబర్ కోర్టు న్యాయమూర్తి, దర్శనాల రాజం వ్యవహారంలో ఇచ్చిన ఆదేశాల ఉత్తర్వులపై హైకోర్టులో అప్పీలు చేసున్నామన్నారు.

# అహంకారంతో మాట్లాడితే ఈ రాష్ట్ర ప్రజలు అధఃపాతాళానికి తొక్కేస్తారు..

### -మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు




హైదరాబాద్ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అహంకారంతో మాట్లాడితే ఈ రాష్ట్ర ప్రజలు అధఃపాతాళానికి తొక్కేస్తారు బిడ్డా అని సీఎంను హరీశ్‌రావు హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.సీఎం పదవిని అందరం గౌరవిస్తాం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతతో మాట్లాడుతాడు, నిజాలు మాట్లాడుతాడు అని విశ్వసిస్తాం. దురదృష్టం ఏంటంటే మన సీఎం రాజ్యాంగబద్ధమైన పదవిలో అంటూ అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నాడు. కుక్క తోక వంకర అన్నట్లు ప్రతిపక్షంలో ఉప్పుడు, అధికారంలో ఉన్నప్పుడు అబద్దాలు మాట్లాడుతున్నాడు. తప్పులు, అబద్దాలు మాట్లాడినప్పుడు పాఠకులకు ప్రజలకు వాస్తవాలు చేరవేసే బాధ్యత మీడియాపై ఉంది. నిజాలను ప్రసారం చేసే గొప్పతనం మీడియాకు ఉంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.నిన్న రేవంత్ రెడ్డి వచ్చి అబద్దాలు మాట్లాడారు. వ్యక్తులు ముఖ్యం కాదు.. రాష్ట్ర ప్రజలు, రాష్ట్ర హక్కులు ముఖ్యం. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. తెలంగాణను తెచ్చిన పార్టీ బీఆర్ఎస్. ఈ రాష్ట్రాన్ని పదేండ్లు పాలించి దేశానికి దిక్సూచిగా నిలిపిన పార్టీ బీఆర్ఎస్. ప్రజలే కేంద్రంగా, రాష్ట్ర హక్కులే కేంద్రంగా బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుంది. రాజకీయాలు కేంద్రంగా, బురదజల్లే విధంగా అబద్దాలు మాట్లాడుతున్నారు సీఎం రేవంత్ రెడ్డి. కాబట్టి నిజాలు ప్రజలకు అందించాలని మీడియాను కోరుతున్నాను అని హరీశ్‌రావు తెలిపారు. నిన్న కాంగ్రెస్ పార్టీ ప్రగతి భవన్‌లో ప్రజెంటేషన్ అధికారిక హోదాలో ఇచ్చింది. కేవలం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పిలిచారు. సచివాలయం నుంచి, ఇరిగేషన్ శాఖ నుంచి వచ్చిన అధికారులు అక్కడి ప్రజెంటేషన్‌లో ఉన్నారు. మిగతా పార్టీలను పిలవాలి కదా..? నిన్న పీపీటీ హైదరాబాద్‌లో ఇచ్చినట్లు లేదు.. అమరావతిలో ఇచ్చినట్లు ఉంది. అది చూసిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తయారు చేసిందా..? చంద్రబాబు పంపిండా..? అనే అనుమానం కలుగుతుంది. బనకచర్లను ఆపాలనే చిత్తశుద్ధి ఉంటే ఏపీ ప్రభుత్వం, చంద్రబాబు కేంద్రానికి రాసిన లేఖలు, జలవనరులకు రాసిన లేఖలు, బనకచర్లను ముందుకు తీసుకుపోతున్న విధానం చూపించాలి. దాని గురించి ఎక్కడ పీపీటీలో చూపించలేదు. దానికి స్థానం దొరకలేదు. కాళేశ్వరం, పాలమూరు, డిండి, తుమ్మిళ్ల లిఫ్ట్‌ను బాబు అడ్డుకున్నారు. వాటిని ఎందుకు పీపీటీలో చూపించలేదు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు.బనచర్ల కట్టే బాబేమో బంగారు లాగా కనబడుతుంది రేవంత్ రెడ్డికి. బనకచర్లను ఆపాలని పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ సచ్చిన పాములాగా కనబడుతుంది. సచ్చిన పాము అయితే కలలో కూడా బీఆర్ఎస్‌ను ఎందుకు కలవరిస్తున్నావు. కేసీఆర్ పేరెత్తకుండా ఒక్క సమావేశంలో కూడా రేవంత్ రెడ్డి మాటాడడు. నిద్రలో కూడా నీకు గులాంబీ జెండాను కనబడుతుంది. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో పదకొండున్నర ఏండ్ల నుంచి అధికారానికి దూరంగా ఉంది. అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయింది. అనేక శాసనసభల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు గెలవలేదు. కొన్ని రాష్ట్రాల్లో ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేదు. అంతమాత్రాన కాంగ్రెస్ పార్టీ సచ్చిన పాము అవుతందా..? నీ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ గల్లంతు అయ్యింది. సచ్చినపాము లాంటి చవకబారు ముచ్చట్లు మాకు కాదు రాహుల్ గాంధీకి చెప్పుకో. నీవు సీఎం అయ్యాక నీ సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గెలిచాం. అహంకారంతో మాట్లాడితే అధఃపాతాళానికి ప్రజలు తొక్కేస్తారు బిడ్డా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.

# టాలీవుడ్ ను నిండా ముంచిన పైరసీ కింగ్ కిరణ్ అరెస్ట్ ..

హైదరాబాద్, జులై 3:తెలుగు సినిమా పరిశ్రమ లో సంచలనం సృష్టించిన భారీ సినిమా పైరసీ కేసులో ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన జన కిరణ్ కుమార్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. కిరణ్ గత ఏడాదిన్నర కాలంలో 65 పెద్ద తెలుగు, తమిళ సినిమాలను పైరసీ చేసి, వాటిని పలు వెబ్‌సైట్లకు అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పైరసీ కారణంగా సినిమా పరిశ్రమకు సుమారు రూ.3700 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఫిల్మ్ ఛాంబర్ ఫిలిం ఛాంబర్ యాంటీపైరసీ సెల్ ప్రతినిధి మణీంద్రబాబు ఇప్పటికే ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అతడి కోసం వేట ప్రారంభించిన పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు..

తెలుగు ఫిలించాంబర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గత ఏడాది పైరసీ వల్ల ఇండస్ట్రీకి దాదాపు రూ.3,500 కోట్ల నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. 2019 నుంచే ఈ పని చేస్తూ వస్తున్న కిరణ్‌కు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. వందల మంది కష్టంతో కోట్లు పెట్టి నిర్మిస్తున్న సినిమాలను పైరసీ చేస్తోన్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టాలీవుడ్ డిమాండ్ చేస్తోంది.

# హాల్‌టికెట్లు.. మూల్యాంకనం.. అన్నీ మోసాలే

### - గ్రూప్-1 అక్రమాలపై హైకోర్టులో కొనసాగిన వాదనలు

హైదరాబాద్, జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); గ్రూప్-1 మెయిన్ పరీక్షల నిర్వహణలో మొదటి నుంచి అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఇందుకు టీజీపీఎస్సీ అవకాశం కల్పించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఆరోపించారు. అయినవాళ్లకు, కొందరికి లబ్ధి చేకూరేలా టీజీపీఎస్సీ వ్యవహరించిందని చెప్పారు. హాల్ టికెట్ల దశ నుంచి పరీక్షా కేంద్రాల ఖరారు, అభ్యర్థుల హాజరు సంఖ్యలో వ్యత్యాసం, మూడుసార్లు మూల్యాంకనం, మూల్యాంకనానికి ఎంపిక చేసిన ప్రొఫెసర్లు.. అన్నీ కూడా ఒక పథకం ప్రకారం జరిగిన అక్రమాలకు అద్దం లాంటి సాక్ష్యాలని అన్నారు. గ్రూప్-1 పరీక్షలో అవకతకవలపై దాఖలైన వ్యాజ్యాలపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు మంగళవారం విచారణ కొనసాగించారు.సీనియర్ న్యాయవాది సురేందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. జనవరి 11 నుంచి 25 వరకు మూల్యాంకనం కోసం ప్రొఫెసర్లను కేటాయించాలని కోరుతూ కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు టీజీపీఎస్సీ లేఖ రాసిందని తెలిపారు. అయితే ఆ లేఖ రాయకముందే సదరు ప్రొఫెసర్లకు వ్యక్తిగతంగా సమాచారం వెళ్లిపోయిందని చెప్పారు. తెలుగులో పరీక్ష రాసిన పేపర్లను ఇంగ్లిషు ప్రొఫెసర్లు ఎలా మూల్యాంకనం చేశారో ఆ దేవుడికే తెలియాలని అన్నారు. మరో సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదిస్తూ, ప్రిలిమ్స్‌కు, మెయిన్‌కు వేర్వేరు హాల్ టికెట్లను జారీ చేయడం టీజీపీఎస్సీ చరిత్రలో వ ా య ్ ం ని వ ం చ ్ ్ ుగా అభివర్ణించారు.అవినీతికి ఇదే తొలి బీజమని చెప్పారు. మూల్యాంకనం తొలిసారి చేసిన వాళ్లకి, రెండో వ్యక్తి బండిల్ నంబర్‌తో ఇస్తారని, మూడో వ్యక్తికి ఇవ్వరని చెప్పారు. పకన కాలమ్‌లో మారులు వేస్తారని, ఇందుకు ప్రాతిపదిక మాత్రం ఉండదని అన్నారు. మూల్యాంకనం చేశారా లేదా అన్న విషయాన్ని గుర్తించడానికి వీల్లేదని తెలిపారు. అయితే, బండిల్ నంబర్లు, సీరియల్ నంబర్లు ఎవరివో వాళ్లకు తెలుసునని అన్నారు.

# రష్యాతో సంబంధాలు కొనసాగిస్తే భారీ సుంకాలు విధిస్తాం

### -భారత్‌కు అగ్రరాజ్యం అమెరికా హెచ్చరిక

న్యూ ఢిల్లీ జూలై 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉక్రెయిన్‌తో సుదీర్ఘ యుద్ధం కొనసాగిస్తున్న రష్యాతో సంబంధాలు కొనసాగిస్తే భారీ సుంకాలు విధిస్తామని అగ్రరాజ్యం అమెరికా హెచ్చరించింది. ఇప్పటికే మాస్కోతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న భారత్, చైనాపై 500 శాతం సుంకాలు విధిస్తామంటూ రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం హెచ్చరించారు. ఇందుకోసం ఓ బిల్లును కూడా తీసుకురానున్న తెలిపారు.ఏబీసీ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లిండ్సే గ్రాహం మాట్లాడుతూ.. 'రష్యా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం ఉంటుంది. భారత్ చైనా దేశాలు మాస్కో నుంచి 70 శాతం చమురు కొనుగోలు చేస్తున్నాయి' అని అన్నారు. రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగించే దేశాలపై అధిక సుంకాలు విధించేలా ట్రంప్ మద్దతుతో యూఎస్ సెనేట్‌లో బిల్లును తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ బిల్లు వచ్చే నెలలోనే ప్రవేశ పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా, రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే.

చైనా సైతం మాస్కో నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. దీంతో యూఎస్ తెచ్చే ఈ బిల్లు భారత్, చైనా దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

# బౌద్ధ సంప్రదాయం ప్రకారమే కొత్త దలైలామా ఎంపిక..

## చైనా పాత్ర ఏం ఉండదన్న టిబెట్ ఆధ్యాత్మిక గురువు..



న్యూ డిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కొత్త దలైలామాను ఎన్నుకుంటామని చేసిన చైనా చేసిన వ్యాఖ్యలపై 14వ టిబెటన్ బౌద్ధ ఆధ్యాత్మిక గురువు దలైలామా టెన్జిన్ గ్యాట్సో అలియాస్ లామా థోండుప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 15వ దలైలామా ఎంపిక 600 సంవత్సరాల పురాతన బౌద్ధ సంప్రదాయాల ఆధారంగానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తన ట్రస్ట్ గాడెన్ ఫోడ్రాంగ్ తీసుకుంటుందని.. ఇందులో చైనా పాత్ర ఏం ఉండదని స్పష్టం చేశారు. దలైలామా 90వ పుట్టినరోజు నాలుగు రోజుల ముందు ప్రారంభమైన టిబెటన్ ఆధ్యాత్మిక కార్యక్రమంలో దలైలామా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యల్లో చైనాతో కొత్త ఘర్షణలకు దారి తీసినట్లుగా పేర్కొంటున్నారు.

జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు..

దలైలామా విడుదల చేసిన ఓ ప్రకటనలో బౌద్ధ సంప్రదాయాల ఆధారంగా తదుపరి దలైలామాను గుర్తించే హక్కు గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని అన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకునే హక్కు మరెవరికీ లేదని స్పష్టం చేశారు. దలైలామా సంస్థను కొనసాగించాలని ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న టిబెటన్లు, టిబెటన్ బౌద్ధుల నుంచి నాకు వివిధ మార్గాల ద్వారా సందేశాలు వచ్చాయని.. దలైలామా సంస్థను కొనసాగించాలని తాను ధ్రువీకరిస్తున్నానన్నారు. తన తర్వాత దలైలామా సంస్థ కొనసాగుతుందని స్పష్టం చేశారు. గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్ టిబెటన్ బౌద్ధ సంప్రదాయాల అధిపతులు, దలైలామాల వంశానికి సమగ్రంగా అనుసంధానించబడిన, ప్రమాణం చేసిన నమ్మకమైన ధర్మ పరిరక్షకులను సంప్రదిస్తుందని చెప్పారు. ఇది సంప్రదాయం.. ప్రకారం శోధన, గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపారు.

చైనాలో జన్మించిన వ్యక్తి వారసుడు కాలేదు

దలైలామా తన వారసుడు చైనా వెలుపల జన్మించాలని అన్నారు. బీజింగ్ నుంచి ఎంపిక చేసిన వ్యక్తిని ఎవరినైనా తిరస్కరించాలని ఆయన సూచించారు. దలైలామా 90వ పుట్టినరోజు వేడుకలు జూన్ 30న ధర్మశాల సమీపంలోని మెక్లియో డ్‌గంజ్‌లోని ప్రధాన ఆలయమైన సుగ్లగ్‌ఖాంగ్‌లో ప్రారంభమయ్యాయి. అదే సమయంలో లామా థోండప్‌ను వేర్పాటువాదిగా భావించే చైనా, శతాబ్దాల నాటి ఆచారం ద్వారా బీజింగ్ వారసుడి గుర్తింపును ఆమోదిస్తుందని చెప్పింది. టిబెటన్ సంప్రదాయంలో, ఒక సీనియర్ బౌద్ధ సన్యాసి ఆత్మ అతని మరణం తర్వాత ఒక పిల్లల శరీరంలో పునర్జన్మ పొందుతుందని నమ్ముతారు. దలైలామా వెబ్‌సైట్ ప్రకారం.. జూలై 6, 1935న ప్రస్తుత క్వింఘై ప్రావిన్స్‌లోని ఒక రైతు కుటుంబంలో లామో థోండప్‌గా జన్మించిన 14వ దలైలామా. రెండేళ్ల వయసులో అలాంటి పునర్జన్మలలో ఒకరని గుర్తించారు.

### మా నిర్ణయం చెల్లుబాటు అవుతుంది: చైనా

చైనా దలైలామా వారసత్వ ప్రణాళికను తిరస్కరించింది. ఏదైనా భావి వారసుడికి తమ ఆమోదం ఉండాల్సిందేనని చెబుతున్నది. ఇది చైనా పాలక కమ్యూనిస్ట్ పార్టీతో టిబెటన్ బౌద్ధమతానికి దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం కొత్త అధ్యాయంగా మారబోతున్నది. దలైలామా వారసుడు మతపరమైన సంప్రదాయాలు, చట్టాలకు అనుగుణంగా దేశీయ గుర్తింపు, బంగారు కలశం ప్రక్రియ, చైనా ప్రభుత్వ ఆమోదం సూత్రాలను అనుసరించాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. 1959లో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ నేతృత్వంలోని చైనా దళాలు టిబెట్‌ను ఆక్రమించుకున్న తర్వాత.. టిబెటన్ల పెద్ద సమూహంతో కలిసి భారత్‌ను ఆశ్రయించి దలైలామా ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. దలైలామా అప్పటి నుంచి ధర్మశాలను తన నివాసంగా చేసుకున్నారు. ఇది బీజింగ్‌కు మింగుడుపడని అంశంగా మారింది. ఆయన ఉనికి చైనా, భారత్ మధ్య వివాదంగా మిగిలిపోయింది. టిబెటన్ స్వయంప్రతిపత్తి కోసం పోరాటం ఆయన వారసుడు సైతం కొనసాగించాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే వారసత్వంలో జోక్యం చేసుకోవడం మానేయాలని, మత స్వేచ్ఛను గౌరవించాలని చైనాను కోరుతూనే ఉంటుందని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు.

### చైనాను ఎప్పటికీ అంగీకరించదు..

టిబెట్ ప్రజలు చైనా ఎంచుకునే వారసుడిని అంగీకరించరని టిబెట్ అధ్యేడు పెన్పా షెరింగ్ సిక్యోంగ్ అన్నారు. టిబెట్ లోపల, వెలుపల ఉన్న టిబెటన్లు జాతీయ ఐక్యతను కాపాడుకోవడానికి, దలైలామా గొప్ప కోరికలు, ఆకాంక్షలు ఆకాంక్షలను నెరవేర్చడానికి హృదయపూర్వకంగా సహకరించాలని ప్రతిజ్ఞ చేశారని ఆయన అన్నారు. టిబెటన్ భాష, మతాన్ని లక్ష్యంగా చేసుకుని టిబెటన్ గుర్తింపును తుడిచిపెట్టడానికి చైనా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, దీన్ని అంగీకరించబోమని ఆయన అన్నారు. బహిష్కృత టిబెటన్లకు సహాయంలో కోతను అమెరికా ఉపసంహరించుకుందని టిబెటన్ ప్రభుత్వం తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం, విద్య వంటి ప్రాజెక్టులకు 7 మిలియన్ డాలర్ల సహాయం ఇవ్వాలని నిర్ణయించారు. జనవరిలో అధికారంలోకి వచ్చిన వెంటనే, ట్రంప్ పరిపాలన అమెరికా ఫస్ట్ ప్రచారం కింద టిబెట్‌కు విదేశీ సహాయాన్ని తగ్గించడం మొదలుపెట్టింది.

## ఒడిశా గంజాం జిల్లాలో అక్రమంగా పశువులను తరలించారన్న అనుమానంతో షెడ్యూల్డ్ కులానికి చెందిన ఇద్దరి పట్ల ఇతర వర్ణాల దౌర్జన్యం

న్యూఢిల్లీ, జులై 3:అక్రమంగా పశువులను తరలించుపోయారన్న అనుమానంతో షెడ్యూల్డు కులానికి చెందిన ఇద్దరి పట్ల ఇతర వర్ణాల వారు దౌర్జన్యానికి పూనుకున్నారని, వారిని కొట్టి, బలవంతంగా గడ్డి తినిపించి, మురుగునీరు తాగించారంటూ వెలువడిన వార్తను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్హెచ్ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఒడిశా గంజాం జిల్లాలో జూన్ 26న ఈ సంఘటన జరిగినట్లు, నిందితులు బాధితుల ఫోన్లు లాక్కోవడమే కాక, వారికి శిరోముండనం కూడా చేయించినట్లు మీడియా కథనం వెల్లడించింది.

వార్త వాస్తవమైనదే అయితే, దీనిని తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించవలసి ఉంటుందని కమిషన్ పేర్కొంది. ఇందుకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను రెండు వారాల్లోగా తనకు సమర్పించాలంటూ ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ, రాష్ట్ర డీజీపీకి కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

దోషుల పట్ల తీసుకున్న చర్యలు, బాధితులకు అందించిన పరిహారం వంటి వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని కమిషన్ ఆదేశాలు స్పష్టం చేశాయి.

## జూలై 31 వరకు పొడిగించిన పద్మ పురస్కారాలు-2026 నామినేషన్ల గడువు

న్యూఢిల్లీ, జులై 3:గణతంత్ర దినోత్సం సందర్భంగా ప్రకటించే పద్మ పురస్కారాలు-2026కు నామినేషన్లు/ సిఫార్సులు 2025, మార్చి 15న ప్రారంభమయ్యాయి. పద్మ పురస్కారాల నామినేషన్లకు చివరి తేదీ 2025, జూలై 31. ఆన్‌లైన్ విధానంలో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (https:// awards.gov.in ) ద్వారా మాత్రమే పద్మ పురస్కారా లకు నామినేషన్లు/ సిఫార్సులు స్వీకరిస్తారు.

పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలు దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారాలు. 1954 నుంచి ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం రోజున ఈ పురస్కారాలను ప్రకటిస్తున్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, ప్రజాసేవ, వ్యాపారం, పరిశ్రమలు సహా అన్ని రంగాలు/విభాగాల్లో 'అత్యుత్తమ సేవలు' అందించిన వారికి గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. జాతి, వృత్తి, స్థాయి, లింగ వివక్ష లేకుండా అందరూ ఈ పురస్కారాన్ని స్వీకరించడానికి అర్హులే. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ పద్మ పురస్కారాలకు అనర్హులు.

పద్మ పురస్కారాలను "ప్రజల పద్మ"గా' మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకే స్వీయ నామినేషన్‌తో సహా అర్హులైన వారిని నామినేట్/సిఫార్సు చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మహిళలు, బలహీన వర్గాలకు చెందిన వారు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగుల్లో నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించడానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం వద్ద భారీ అగ్నిప్రమాదం

## – చలువ పందిళ్లకు మంటలు ... రెండు షాపులు దగ్ధం



తిరుపతి జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం వద్ద పెను ప్రమాదం తప్పింది. ఆలయం సమీపంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గుడి ముందుభాగంలో ఉన్న ఓ షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి షాప్ మొత్తం విస్తరించడంతో అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ క్రమంలో ఆలయం ముందున్న చలువ పందిళ్లకు మంటలు అంటుకున్నాయి. రెండు షాపులు గద్ధమయ్యాయి. భారీగా మంటలు ఎగిసి పడటంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

# ప్రమాద బీమా పాలసీపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

## -అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో మరణించిన వారికి బీమా కంపెనీలు పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు

న్యూ డిల్లీ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రమాద బీమా పాలసీపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో మరణించిన వారికి బీమా కంపెనీలు పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే..2014 జూన్ 18న కర్ణాటకలోని మల్లసంద్ర గ్రామానికి చెందిన ఎన్ఎస్ రవీష్ తన కుటుంబంతో కలిసి కారులో ప్రయాణిస్తున్నాడు. ఆ సమయంలో మలనహళ్లి సమీపంలో అతివేగం కారణంగా వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రవీష్ అక్కడికక్కడే మరణించాడు. రవీష్ భార్య, కొడుకు, తల్లిదండ్రులు కలిసి రూ. 80 లక్షల బీమా పరిహారం కోరారు. అయితే, పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీటులో అతను నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. దీనిపై మోటార్ యాక్సిడెంట్ ట్రిబ్యునల్ కూడా కుటుంబానికి పరిహారం ఇవ్వడానికి నిరాకరించింది. తర్వాత, వారు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. టైరు పేలినందువల్లే ప్రమాదం జరిగిందని తమ వాదనలు వినిపించారు.

కానీ నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్టు ఆధారాలు ఉండడంతో వారి వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసు చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లింది. జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ ఆర్ మహాదేవన్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించి.. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు బీమా డబ్బులు రావని పేర్కొంది.

బీమా చేసినా కూడా జరిగిన ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణం అయితే సదరు కంపెనీలు బీమా డబ్బులు చెల్లించనక్కర్లేదని కోర్టు స్పష్టం చేసింది. వాహనం నడిపేటప్పుడు బాధ్యతతో వ్యవహరించకపోతే.. ప్రమాదాలే కాకుండా బీమా ప్రయోజనాలూ కోల్పోవాల్సి వస్తుందని వివరించింది.

# విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో దాడులు

## -ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించిన జగన్

అమరావతి జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తారా అని చంద్రబాబును జగన్ ప్రశ్నించారు. ఎన్ఎంసీ ) గైడ్‌లైన్స్ ప్రకారం వాళ్లంతా ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులైన తరువాత, ఇక్కడే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసినా, ఎందుకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వడం లేదు అని నిలదీశారు. ఇది కేవలం ఒక ఫార్మాలిటీ అయినా, ఇది ఇవ్వకుండా ఎందుకు వేధిస్తున్నారు? ఇదేనా మీ పరిపాలన? మీరు చేస్తున్న తప్పులను ఎత్తిచూపితే వారిపై పోలీసులతో దాడులు చేయిస్తారా అని ప్రశ్నించారు. గడిచిన ఏడాది కాలంగా వారిపై వివక్ష చూపుతూ, ఇంటర్న్‌షిప్ పేరుతో దీర్ఘకాలం వెట్టిచాకిరి చేయించుకుంటూ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు లాభం చేకూర్చేలా, ఉద్దేశ పూర్వకంగా వీరికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబర్ ఇవ్వకపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆస్తులు అమ్మి విదేశాలకు పంపిస్తే, ఆ పిల్లలు కష్టపడి చదువుకుని కోర్సులు పూర్తిచేశారు. అలాంటి వారిని అంటరాని వారిగాచూస్తూ, వారి కెరీర్‌ను నాశనం చేయడం ఎంతవరకు సమంజసం? వారిని నిరుత్సాహపరచాలన్నది మీ ప్లాన్‌లో భాగం కాదా అని నిలదీశారు.డాక్టర్లు కావాలనుకుంటున్న పిల్లలు విదేశాలకు వెళ్లి చదువుకునే ఇబ్బందుల్లేకుండా, ఇక్కడే, మన రాష్ట్రంలోనే, ప్రభుత్వరంగంలో 17 కాలేజీలను, వాటిద్వారా 2,550 సీట్లను తీసుకు వచ్చేలా మా ప్రభుత్వం పనులు చేసి, అందులో ఐదు కాలేజీలను ప్రారంభించిందని వైఎస్ జగన్ గుర్తుచేశారు. మిగిలిన కాలేజీలను కూడా పూర్తిచేసే స్థాయికి తీసుకువెళ్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా అడ్డుకున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సీట్లు కేటాయిస్తే, వాటిని వద్దు అన్న ప్రభుత్వం, దేశ చరిత్రలో వీరిది మాత్రమే కాదా అని మండిపడ్డారు. మీ అవినీతి కోసం స్కామ్‌లు చేస్తూ ఆ కాలేజీలను ప్రయివేటీకరించే కుట్ర చేస్తున్నారరని ఆగ్రహంవ్యక్తం చేశారు. పులివెందుల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ కేటాయించిన సీట్లను కూడా వద్దు అంటూ తిరిగి లేఖ రాసి, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. ఇప్పుడు దేశం కాని దేశం వెళ్లి అక్కడ ఖర్చులు తగ్గించుకుని, కష్టపడి కోర్సులు పూర్తిచేసి వస్తే, వారికి పీఆర్ నంబర్ ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారు. పైగా అడిగితే పోలీస్ స్టేషన్‌లో వేశారు. తల్లిదండ్రులపైనా, విద్యార్థులపైనా ఇంత పగ ఎందుకు చంద్రబాబూ అని ప్రశ్నించారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని, ఎన్ఎంసీ గైడ్‌లైన్స్ ప్రకారం ఎఫ్ఎంజీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వీరికి వెంటనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రాజన్న క్షేత్రంలో చతుర్వేద స్మార్త పరీక్షలు

## -వేములవాడలో జరపడం గొప్ప గౌరవం
## -నాలుగు వేదాలు చదివే పాఠశాల ఇక్కడే
## -సంతోషం వ్యక్తం చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత



విద్యాలయ ట్రస్ట్ వారి చతుర్వేద స్మార్త పరీక్షలు నిర్వహించడం గర్వంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. దేశ వ్యాప్తంగా మొట్టమొదటి సారిగా పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు వేములవాడ లో ఏర్పాటు చేశారు.

విద్వత్ సదస్సులో భాగంగా వేద పండితులకు చతుర్వేద స్మార్త పరీక్షలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామితో కలిసి రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా దేశవ్యాప్త వేద పండిత విద్యార్థులు హాజరయ్యే పరీక్షలు వేములవాడలో జరపడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ప్రభుత్వ విప్ అన్నారు. నాలుగు వేదాలు చదివే పాఠశాల ఒక్క వేములవాడలోనే ఉందని, వేద పండితులకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలు రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఇదివరకు తిరుమల తిరుపతిలో జరిగే పరీక్షలు ఇప్పుడు రాజన్న సన్నిధిలో నిర్వహించి వారికి పట్టాలు పంపిణీ చేయడం మన ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , మంత్రి కొండా సురేఖ కు కృతజ్ఞతలు తెలిపారు.

# సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడానికి ఎస్పీఆర్ఈఈ 2025 ప్రారంభించిన ఈఎస్ఐసీ

న్యూఢిల్లీ, జులై 3:హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయ అధ్యక్షతన జరిగిన ఈఎస్ఐ కార్పొరేషన్ 196వ సమావేశంలో ఎస్పీఆర్ఈఈ 2025 (ఉద్యోగులు, యాజమాన్యాల నమోదును ప్రోత్సహించే పథకం)ను కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) ఆమోదించింది.

ఈఎస్ఐ చట్టం ప్రకారం సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడమే ఈఎస్ఐసీ ఆమోదించిన స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (ఎస్పీఆర్ఈఈ) 2025 లక్ష్యం. ఈ పథకం 2025 జులై 1 నుంచి డిసెంబర్ 31 వరకు అమలులో ఉంటుంది. ఇప్పటి వరకు నమోదు చేసుకోని యాజమాన్యాలు, ఒప్పంద, తాత్కాలికంగా పనిచేస్తున్న వారితో సహా ఉద్యోగులందరూ ఎలాంటి తనిఖీలు లేదా పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుంది.

ఎస్పీఆర్ఈఈ 2025లో చేపట్టే కార్యక్రమాలు

తమ సంస్థలు, ఉద్యోగులను ఈఎస్ఐసీ పోర్టల్, శ్రామ్ సువిధ, ఎంసీఏ పోర్టల్ ద్వారా డిజిటల్ గా నమోదు చేసుకోవచ్చు.

యజమాని ప్రకటించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చెల్లుబాటును పరిగణనలోకి తీసుకుంటారు.

రిజిస్ట్రేషన్ ముందు కాలానికి ఎలాంటి చందా లేదా ప్రయోజనం వర్తించదు.

రిజిస్ట్రేషన్ ముందు కాలానికి సంబంధించిన రికార్డుల తనిఖీలు నిర్వహించరు. పాత రికార్డుల గురించి అడగరు.

జరిమానాల భయాన్ని తొలగించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా స్వచ్ఛందంగా నమోదు చేసుకొనేలా ఈ పథకం ప్రోత్సహిస్తుంది. ఎస్పీఆర్ఈఈ పథకం ప్రారంభించడానికి ముందు నిర్దిష్ట కాలవ్యవధిలో నమోదు చేసుకోకపోతే.. చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వచ్చేది. లేదా పాత బకాయిలు చెల్లించాల్సి వచ్చేది. ఈ అడ్డంకులను తొలగించి... నమోదు కాని ఇతర సంస్థలు, కార్మికులను సైతం ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చి, సమగ్ర సామాజిక భద్రతను అందించడమే ఎస్పీఆర్ఈఈ 2025 లక్ష్యం.

ఎస్పీఆర్ఈఈ 2025 ప్రారంభంతో సమ్మిళితమైన, సామాజిక భద్రతను అందించే పురోగమన సమాజం దిశగా కార్మిక రాజ్య బీమా సంస్థ ముందడుగు వేసింది.

# కొవిడ్-19 తర్వాత మధ్య వయస్కుల్లో ఆకస్మిక మరణాలపై ఐసీఎంఆర్, ఎయిమ్స్ విస్తృత పరిశోధనలు

న్యూఢిల్లీ, జులై 3:కారణం తెలియని ఆకస్మిక మరణాల అంశాన్ని దేశంలోని వివిధ ఏజెన్సీలు అధ్యయనం చేశాయి. ఈ అధ్యయనాలు కొవిడ్ 19 టీకాకు, దేశంలో సంభవిస్తున్న అకాల మరణాలకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని తేల్చాయి.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ) చేపట్టిన అధ్యయనాలు భారత్‌లో ఇచ్చిన కొవిడ్-19 వ్యాక్సిన్లు పూర్తిగా సురక్షితమైనవి, ప్రభావవంతమైనవని స్పష్టం చేశాయి. అలాగే తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదురైన పరిస్థితులు అత్యంత అరుదుగా ఉన్నాయని తేలింది. గుండె సంబంధింత కారణాల వల్ల అకస్మాత్తుగా సంభవించే కారణాలకు జన్యువులు, జీవనసరళి, గతంలో ఉన్న, కొవిడ్ అనంతరం ఎదురైన అనారోగ్య సమస్యలు తదితరమైనవి కారణం కావచ్చు.

ముఖ్యంగా 18 నుంచి 45 ఏళ్ల లోపు వారిలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాల వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకొనేందుకు ఐసీఎంఆర్, ఎన్సీడీసీ కలసి పనిచేస్తున్నాయి. దీన్ని పూర్తిగా తెలుసుకోవడానికి, భిన్న పరిశోధనా విధానాలను అనుసరించి రెండు అనుబంధ అధ్యయనాలు చేపట్టాయి. మొదటిది గతంలో డేటా ఆధారంగా చేపట్టగా.. రెండోదాన్ని వాస్తవిక పరిశోధన ఆధారంగా చేశారు. మొదటి అధ్యయనాన్ని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఎపిడిమియాలజీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఐఈ) చేపట్టింది. "భారత్‌లో 18 నుంచి 45 ఏళ్ల వారిలో ఆకస్మిక మరణాల వెనక కారణాలు - ఒక బహుళ కేంద్రక అధ్యయనం" పేరుతో ఈ పరిశోధన చేపట్టింది. దీన్ని 2023 మే నుంచి ఆగస్టు వరకు 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 46 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చేపట్టారు. 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి వరకు ఆరోగ్యంగా కనిపిస్తూనే.. ఆకస్మికంగా మరణించిన వ్యక్తులపై ఈ పరిశోధనలో దృష్టి సారించారు. యువతలో కారణం తెలియని ఆకస్మిక మరణాలను కొవిడ్ - 19 కారణం కాదని ఈ అధ్యయన ఫలితాలు నిరూపించాయి.

"యువతలో ఆకస్మిక మరణాలకు గల కారణాన్ని గుర్తించడం" పేరుతో రెండో అధ్యయనాన్ని ఐసీఎంఆర్ భాగస్వామ్యంతో న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) చేపడుతోంది. దీనికి ఐసీఎంఆర్ నిధులు సమకూరుస్తోంది. యువతలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు గల కారణాలను గుర్తించడమే ఈ అధ్యయనం లక్ష్యం. దీని ప్రాథమిక విశ్లేషణ ప్రకారం యువతలో ఆకస్మిక మరణాలకు గుండెపోటు లేదా మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (ఎంఐ) ప్రధాన కారణమని గుర్తించారు. ముఖ్యంగా, మునుపటి సంవత్సరాలతో పోలిస్తే.. ఈ కారణాల్లో పెద్దగా మార్పులు ఏమీ లేవు. ఈ మరణాలకు ఎక్కువ శాతం జన్యుపరమైన మార్పులను కారణంగా గుర్తించారు. ఈ అధ్యయనం పూర్తయిన తర్వాత తుది వివరాలను వెల్లడిస్తారు.

ఈ రెండు అధ్యయనాలు భారత యువతలో ఆకస్మిక మరణాలకు గల కారణాలపై సమగ్ర అవగాహన కల్పిస్తాయి. అలాగే ఈ ముప్పును కొవిడ్ - 19 వ్యాక్సిన్ పెంచదని వెల్లడైంది. అయితే అంతర్లీన ఆరోగ్య సమస్యలు, జన్యుపరమైన సమస్యలు, అనారోగ్యకరమైన జీవనశైలి ఈ అకాల మరణాలకు కారణమవుతున్నాయి.

కొవిడ్ టీకాకు, ఆకస్మిక మరణాలకు సంబంధం ఉందనే వాదన అవాస్తమని, తప్పుదోవ పట్టించేదని, దీనికి శాస్త్రీయ ఆమోదం లేనిదని నిపుణులు స్పష్టం చేశారు. మహమ్మారి సమయంలో కోట్లాది మంది ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషించిన టీకాలపై ఆధారాలు లేని ఊహాజనితమైన వార్తలు విశ్వాసాన్ని దెబ్బ తీస్తాయి. ఇలాంటి నిరాధారమైన నివేదికలు, వాదనలు దేశంలో వ్యాక్సిన్లపై సంశయాన్ని పెంచుతాయని, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని పేర్కొన్నారు.

# అంతర్జాతీయ మాదకద్రవ్య ముఠా గుట్టు రట్టు చేసిన ఎన్సీబీ, ఇతర సంస్థలకు కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అభినందనలు

న్యూఢిల్లీ, జులై 3:అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాను ఛేధించిన ఎన్సీబీతో సహా ఇతర సంస్థలను కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా అభినందించారు. డ్రగ్ ముఠాలు ఎక్కడి నుంచి పనిచేస్తున్నా వాటిని నిర్మూలించి దేశ యువతను రక్షించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

"అంతర్జాతీయ డ్రగ్ ముఠా గుట్టును రట్టు చేసిన ఎన్సీబీ, ఇతర ఏజెన్సీలకు శుభాకాంక్షలు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయానికి గొప్ప ఉదాహరణగా నిలిచిన ఈ దర్యాప్తులో 8 మందిని అరెస్టు చేశారు. 5 ప్యాకేజీలుగా ఉన్న సరుకును స్వాధీనం చేసుకున్నారు. 4 ఖండాలు,10కి పైగా దేశాల్లో విస్తరించిన ఈ ముఠాపై అమెరికా, ఆస్ట్రేలియాలో చర్యలు తీసుకున్నారు. క్రిప్టో చెల్లింపులు, అజ్ఞాత డ్రాప్ షిప్పర్లు వంటి ఆధునిక పద్ధతులను అనుసరిస్తున్న ఈ ముఠాల కదలికలపై ఏజెన్సీలు నిఘా ఉంచాయి. మాదకద్రవ్య ముఠా ఎక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నా సరే దాన్ని నిర్మూలించడానికి, యువతను రక్షించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు చేపట్టిన సుదీర్ఘ ప్రయత్నాల్లో ఇది ఒకటి. దీనిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) ప్రధాన కార్యాలయంలోని కార్యకలాపాల విభాగం అంతర్జాతీయంగా మాదక ద్రవ్యాలను రవాణా చేసే ముఠాను నిర్వీర్యం చేసింది. ఈ ముఠా రహస్య సందేశ మాధ్యమాలను, డ్రాప్ షిప్పింగ్ విధానాలను, క్రిప్టో కరెన్సీని ఉపయోగించి నియంత్రిత ఔషధాలను నాలుగు ఖండాల్లో అక్రమంగా రవాణా చేస్తోంది. ఈ రహస్య దాడి న్యూఢిల్లీలోని బెంగాలీ మార్కెట్ దగ్గరలో సాధారణంగా చేపట్టే వాహన తనిఖీలతో ప్రారంభమైంది. ఈ చర్య భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపాల్లో విస్తరించిన అధునాతన నేర వ్యవస్థను బయటపెట్టింది. అలాగే ప్రపంచమంతా విస్తరించిన చట్ట విరుద్ధమైన ఫార్మా వ్యవస్థ పరిధిని, సమన్వయంతో కూడిన అంతర్జాతీయ చర్యలను చేపట్టడంలో ఎన్సీబీ సామర్థ్యాన్ని కూడా తెలియజేసింది. 4 ఖండాలు, 10 కి పైగా దేశాల్లో విస్తరించిన అక్రమ మాదక ద్రవ్యాల వ్యవస్థ గుట్టును రట్టు చేసింది.

ఇంటిలిజెన్స్ నుంచి అందుకున్న సమాచారం ఆధారంగా 2025, మే 25న ఎన్సీబీ ప్రధాన కార్యాలయంలోని ప్రత్యేక బృందం ఢిల్లీలోని మండీ హౌస్ వద్ద ఒక కారును తనిఖీ చేసింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తుల నుంచి 3.7 కిలోల ట్రామడోల్ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరూ నోయిడాలోని ప్రముఖ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో బీఫార్మా పూర్తి చేశారు.

ప్రముఖ భారతీయ బీ2బీ వేదికలో విక్రేత ప్రొఫైల్ నిర్వహిస్తున్నట్లుగా అరెస్టయిన వ్యక్తులు అంగీకరించారు. అక్కడి నుంచి అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాల్లో ఔషధ మాత్రలను అమ్ముతున్నట్లు వెల్లడించారు. విచారణలో సేకరించిన ఆధారాలు రూర్కీలో సరకు నిల్వ చేసే వ్యక్తి వద్దకు దారి తీశాయి.

# ఘనంగా వారాహి అమ్మవారి హోమం



హైదరాబాద్, జులై 3: వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారి పూజా మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమశాలలో వారాహి హోమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆషాడ శుద్ధ పాడ్యమితో మొదలుకొని శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను స్థానిక పంచవటి కాలనీ లోని రామాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పూజా మందిరంలో అత్యంత భక్తి శ్రద్ధలతో వేదపండితులు వైభవంగా నిర్వహిస్తున్నారు.

లోకా కళ్యాణార్థం సమస్త ప్రజల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అరవరోజు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన వారాహి హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నిర్వహిస్తున్నారు.

ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వేదపండితుల స్వీయ పర్యవేక్షణలో నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు.

## జూలై 5న బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా రాంచందర్ రావు బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్ జూలై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ రాంచందర్ రావు ఎన్నికైన తర్వాత జూలై 5 తేదీన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. మొదటగా జులై 5 తేదీ ఉదయం 9 గంటలకు అసెంబ్లీ దగ్గర్లో ఉన్న గన్ పార్క్ లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారు. తర్వాత ఉదయం 10 గంటలకు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, బిజెపి రాష్ట్ర పదాధికారులు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు.

# విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలి.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : కలెక్టర్ హైమావతి

సిద్ధిపేట, జులై 03 : సిద్ధిపేట జిల్లాలో ప్రభుత్వ జూనియర్, గురుకుల జూనియర్ కళాశాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చి అడ్మిషన్లు పెంచాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నుండి మంజూరైన నిధులను కళాశాలలకు పెయింటింగ్, టేబుల్స్, డ్యూయల్ డెస్క్, విండోస్ రిపేర్ చేయించాలని అధికారులకు తెలిపారు. ఇంజనీరింగ్ ఏజెన్సీ నిర్వహించే అన్ని పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అత్యవసర తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని.. కావాల్సిన వాటికి ఎస్టిమేట్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

వివిధ ప్రాంతాల నుండి కళాశాలకు రావడానికి బస్ సౌకర్యం కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించి కావాల్సిన రూట్లకు బస్ సౌకర్యం, కొన్ని కళాశాలలకు బస్ పరిధి పెంచేందుకు నోట్ తయారు చేసి ఆయా రీజనల్ మేనేజర్ లెటర్ పెట్టాలన్నారు. జూనియర్ కళాశాల, అన్ని హాస్టళ్లలో సౌకర్యాలు సమకూర్చి ఒక్క సీటు కూడా మిగలకుండా విద్యార్థులు చేరేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు విద్యార్థుల పట్ల మానవీయ కోణంలో ఆలోచించాలని, గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్, కొన్ని కళాశాలల్లో రాత్రి వేళల్లో ఆకతాయిలు చేరి మద్యం తాగుతూ, కిటికీలు, డోర్, టాయిలెట్స్ ఇతరత్రా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని తెలుపగా.. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పికెటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతలో రాజీపడవద్దని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఐఈఓ రవీందర్ రెడ్డి, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిబిసీడీవో నాగరాజమ్మ, డిఎస్సిడిఓ కవిత, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ, జులై 3:అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి వాటిని వెంటనే సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు ఎరువుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. చిట్యాల మండలానికి 394 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు, వాటికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మిషన్ భగీరథ కోసం రోడ్లు ధ్వంసం చేశారు కానీ అన్ని గ్రామాలకు సరిగ్గా నీళ్లు అందడం లేదని సంబంధిత అధికారులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే సాగునీటి కోసం పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, ఉదయ సముద్రం కాల్వల ద్వారా నింపే చెరువులు కాకుండా మిగిలిన చెరువులను కూడా నింపడానికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ అధికారులు రైతులను చైతన్య వంతం చేసి సహజ ఎరువులు వాడేలా అవగాహన కల్పించాలని, చిరు ధాన్యాలను పండించటానికి అవసరమైన ప్రోత్సాహకాలను అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఎస్పీ జయలక్ష్మి, తాసీల్దార్ కృష్ణ, సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్, వెల్మినేడు పీఏసీఎస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# తక్షణ సహాయం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలం.. ఎమ్మెల్యే తలసాని ఫైర్

హైదరాబాద్, జులై 3: ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించేలా నిబంధనలున్నా, రెవెన్యూ అధికారులు ఆ దిశగా బాధ్యతగా స్పందించడం లేదని సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారే తప్ప, బాధిత కుటుంబాలకు తదుపరి సహాయక చర్యలు అందేలా చూడడంలో రెవెన్యూ యంత్రాంగం ఘోరంగా విఫలమైన ఉదంతాలు ఇటీవల అనేకం ఉన్నాయన్నారు. ఈ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన రవికిరణ్, మాధవి దంపతులు తమ ఏడేళ్ల కుమారుడు మాన్వితతో కలిసి సనత్‌నగర్ రాజరాజేశ్వరినగర్‌లోని ఓ ఇంట్లోని మూడవ అంతస్తులో అద్దెకు నివాసముంటున్నారు.

గురువారం ఉదయం 7.30 గంటలకు తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి రిఫ్రిజిరేటర్ నుండి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో తల్లిదండ్రులు కూరగాయల మార్కెట్ వెళ్లడంతో ఇంట్లో మాన్విత్ ఒక్కడే ఉన్నాడు. అదేసమయంలో ఊహించిన విధంగా రిఫ్రిజిరేటర్ నుండి మంటలు వ్యాపించడంతో, ఏడేళ్ల మాన్విత్ ఏమాత్రం ఆందోళన చెందకుండా తల్లిదండ్రులకు ఇంట్లో ఉన్న ఫోన్ ద్వారా సమాచారం అందించడమే కాకుండా, చుట్టుపక్కల వారిని కూడా అప్రమత్తం చేయడంతో, చుట్టుపక్కల వారు వచ్చి మంటలు మరింత వ్యాపించకుండా నీళ్లు చల్లారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లోని బట్టలు, వస్తువులతో పాటు పుస్తకాల్లో దాచుకున్న నగదు కూడా కాలిపోవడంతో రవికిరణ్ దంపతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రెవెన్యూ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు చేయూతగా రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఏడుళ్ల మాన్విత్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడాన్ని ఎమ్మెల్యే తలసాని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ యంత్రాంగం ప్రమాద బాధితులకు తక్షణ సహాయ చర్యలు అందించే వీలున్నా సరిగ్గా స్పందించడం లేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి వెంటనే తగిన చేయూతనందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్రెడ్డి, సీనియర్ నాయకులు సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం



తిరుపతి, జులై 3: తిరుపతి శ్రీనివాసమంగాపురం శ్రీవారి మెట్టు సమీపంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు ప్రారంభమై శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేరుకుంది. అక్కడ క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బల్లెంను ప్రయోగించారు.

ఆస్థానం అనంతరం సాయంత్రానికి స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకువస్తారు . ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. భజన బృందాలు భజనలు, కోలాటాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏపీవో గోపినాథ్, తదితర అధికారులు, శ్రీవారి సేవకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్తను వేరుగా అందించాలి.. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి



కరీంనగర్, జులై 3:తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సూచించారు. స్థానిక రాంనగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఐఈసీ ప్రచారంలో భాగంగా పోస్టర్, స్టిక్కర్ల ను విడుదల చేశారు. కుక్క కాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజలకు అవగాహన కోసం ఇంటింటికి అంటించారు.

తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆటోనగర్ వరకు రాజీవ్ రహదారి వెంట ఉన్న చెట్లు, ముళ్ల పొదలను తొలగించారు. పాత మునిసిపల్ కార్యాలయం ప్రక్కన ఉన్న వాటర్ ట్యాంక్ పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ వార్డు అధికారులతోపాటు శానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, కిరణ్, సీఓలు ప్రియదర్శిని, శమంతకమణి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఈఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి : జాఫర్ హుస్సేన్

ఖమ్మం, జులై 3: ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ జాఫర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. గురువారం రోజు వర్క్ షాప్. జీఎం ఆఫీస్, ఏరియా హాస్పిటల్ సిబ్బందితో నిర్వహించిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ నల్ల చట్టాలుగా మార్పు చేయడానికి జేఏసీ నాయకులు తీవ్రంగా విమర్శించారు.

ఈ నల్ల చట్టాలు కార్మికుల హక్కులను హరించేలా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమ్మెతో కేంద్రానికి కనువిప్పు కలగాలని జేఏసీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సారయ్య, జె.వెంకటేశ్వర్లు, నబీ, అబ్బాస్, సత్యనారాయణ, మహబూబ్, యాదగిరి, కృష్ణారావు, ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎయిర్ ఇండియా విమానాల్లో ఆందోళన కలిగిస్తున్న సాంకేతిక సమస్యలు

న్యూ ఢిల్లీ జులై 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); టాటా గ్రూప్ ఆధీనంలో నడుస్తున్న దేశీయ ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్న అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ఈ సమస్యలు మరింత తీవ్రతరమయ్యాయి. తాజాగా అమెరికా వెళ్తున్న ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని వియన్నాలో నిలిపివేయాల్సి వచ్చింది .డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఏఐ103 విమానం జులై 2న ఢిల్లీ నుంచి వాషింగ్టన్ డీసీకి బయల్దేరింది. మార్గం మధ్యలో ఇంధనం నింపుకు నేందుకు వియన్నాలో ఆగింది. స్టాప్‌ఓవర్ సమయంలో సాధారణ తనిఖీల్లో నిర్వహణ సమస్య తలెత్తింది. దీంతో ముందు జాగ్రత్తగా విమాన ప్రయాణాన్ని అధికారులు రద్దు చేయాల్సి వచ్చింది.

ప్రయాణికులకు అక్కడే హోటల్ వసతి కల్పించినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఆ తర్వాత వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు విమానంలో సాంకేతిక సమస్య కారణంగా వాషింగ్టన్ నుంచి వియన్నా మీదుగా ఢిల్లీకి రావాల్సిన ఏఐ104 విమాన సేవలపై తీవ్ర ప్రభావం పడింది. ఆ సర్వీసును కూడా అధికారులు రద్దు చేశారు. టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు పూర్తి వాపస్ అందిస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది.కాగా, గతనెల 12న డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఎయిర్ ఇండియా విమానం అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్ బయల్దేరి విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో దాదాపు 272 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## మరాఠీ మాట్లాడటం తప్పనిసరి.. మహారాష్ట్ర మంత్రి స్పష్టం

ముంబై, జులై 3: మహారాష్ట్రలో మరాఠీ మాట్లాడటం తప్పనిసరి అని ఆ రాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ అన్నారు. మరాఠీ భాషను అగౌరవపరిస్తే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. మరాఠీలో మాట్లాడటానికి నిరాకరించినందుకు మంగళవారం థానేలో ఒక ఫుడ్ స్టాల్ యజమానిపై మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) కార్యకర్తలు దాడి చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

కాగా, మహారాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ ఈ సంఘటనపై గురువారం స్పందించారు. రాష్ట్రంలో ఉన్న వారు మరాఠీ మాట్లాడటం తప్పనిసరి అని అన్నారు. 'మహారాష్ట్రలో మీరు మరాఠీ మాట్లాడాలి. మీకు మరాఠీ తెలియకపోతే, మరాఠీ మాట్లాడబోమన్న వైఖరి ఉండకూడదు. మహారాష్ట్రలో ఎవరైనా మరాఠీని అగౌరవపరిస్తే, మేం మా చట్టాలను అమలు చేస్తాం' అని మీడియాతో అన్నారు.




ఆహ్వానం

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

రంగస్థల కళల శాఖ

"పిజి డిప్లొమా ఇన్ ఫిల్మ్ డైరెక్షన్" కోర్సు విద్యార్థి

ప్రముఖ రచయిత, సినీ దర్శకులు

శ్రీ ప్రభాకర్ జైని గారు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

గద్దర్ సినీ అవార్డు అందుకున్న శుభ సందర్భంగా

అభినందన సభ

సభా కార్యక్రమం

ముఖ్య అతిథి: ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం

విశిష్ట అతిథి: శ్రీ శ్రీనివాసులు వేముల, ఓఎస్‌డి టు తెలంగాణ సీఎమ్

సభాధ్యక్షులు: డా॥ బి.హెచ్.పద్మప్రియ, శాఖాధిపతి, రంగస్థల కళల శాఖ, పీఠాధిపతి ఐ/సి, సామాజిక తదితర శాస్త్రాల పీఠం

గౌరవ అతిథులు: శ్రీ యమ్.వి.రఘు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్, సినీ దర్శకులు

శ్రీ కె.యల్.ప్రసాద్, ప్రముఖ సినీ రచయిత, సినీ దర్శకులు

తేది: 04-07-2025, సమయం: మధ్యాహ్నం 3.00 గంటలకు, సమావేశ మందిరం, మొదటి అంతస్తు, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి హైదరాబాదు.

డా॥ బి.హెచ్.పద్మప్రియ, శాఖాధిపతి, రంగస్థల కళల శాఖ | డా॥ బి.రాధ, పీఠాధిపతి, లలిత కళా పీఠం | ఆచార్య కోట్ల హనుమంతరావు, రిజిస్ట్రార్


# ఆరోగ్య రంగ అభివృద్ధికి నూతన దిశ..

## -కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు



అమరావతి, జులై 3:ఆంధ్రప్రదేశ్‌ను సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో స్వర్ణ ఆంధ్ర విజన్‌ను ముందుకు తీసుకెళ్తున్నామని టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.


ఆరోగ్య రంగాన్ని ఆధునికీకరించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న వినూత్న చర్యల భాగంగా, రాష్ట్రంలో తొలిసారిగా కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ ను ప్రారంభించారు. టాటా గ్రూప్ తో భాగస్వామ్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ద్వారా కుప్పం నియోజకవర్గంలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు డిజిటల్ విధానంలో అనుసంధానమయ్యాయి.

ఈ నూతన కేంద్రం డిజిటల్ మెడికల్ రికార్డులు, వర్చువల్ కన్సల్టేషన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వైద్య సేవలను అందిస్తుందని చంద్రబాబు నాయుడు అన్నారు. ఇది ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను ప్రజల ఇంటి వద్దకు తీసుకెళ్లడానికి మార్గం చూపుతుందని ఆయన అన్నారు.

ప్రజల అవసరాల కేంద్రంగా ఉండే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఏర్పడుతోందని, దీనివల్ల రోగులకు తక్షణ సమాచారం, వ్యక్తిగత చికిత్సా ప్రణాళికలు లాంటి సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని అన్నారు. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక ఉందని చెప్పారు.

ఇది కేవలం డబ్బు కోసమే కాదని? ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య రంగాన్ని కొత్త దిశలో తిరుగులేని మార్గంలో తీసుకెళ్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## బార్బిక్యూ నేషన్ 'కుక్కడ్ కార్నివాల్' ప్రారంభం



హైదరాబాద్, జులై 3: దేశంలో ప్రముఖ బఫే డైనింగ్ చైన్ బార్బిక్యూ నేషన్ 'కుక్కడ్ కార్నివాల్' ను ప్రారంభించింది. ఈ చికెన్ ఫుడ్ ఫెస్టివల్ జూలై 10వ తేదీ వరకు జరగనుంది. ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేకంగా చికెన్ వంటకాలు నోరూరించనున్నాయి. రుచికరమైన బఫే వంటకాలకు బార్బిక్యూ నేషన్ ఎంతో ప్రసిద్ధి చెందినదన్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా వినియోగదారులకు విభిన్నమైన వంటకాలతో చికెన్ విందును అందించనున్నామని చెప్పారు. నాన్ వెజ్ ప్రియుల కోసం ఈ మేళా ప్రారంభించామన్నారు. చికెన్ మరగ్ సూప్ తో సహా రుచికరమైన స్టార్టర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. భునా రసీలా కుక్కడ్, చికెన్ కీమా సమోసా, చికెన్ కీమా పావ్, హరే మసాలా తవా చికెన్, స్టఫ్డ్ చికెన్ చీజ్ టిక్కీ, క్రిస్పీ చికెన్ స్ట్రిప్స్, చిల్లీ స్వీట్ చికెన్ విడ్స్ కలవన్నారు. ఇక భోజనం కూడా అంతే రుచికరంగా ఉంటుందన్నారు. అతి తక్కువ మసాలాలతో వండిన చికెన్ హలీం, దమ్ కా ముర్గ్, ముర్గ్ చేంజేర్ఝి, తందూరీ ఘీ రోస్ట్ చికెన్ బిర్యానీ ఈ ఫెస్టివల్ ను మరింత ప్రత్యేకంగా మారుస్తాయన్నారు. మిఠాయిలతో భోజనాన్ని ముగించడానికి ఫ్రూట్ కస్టర్డ్ (పాలు, కస్టర్డ్ పొడి, తాజా పండ్లతో తయారు చేసిన క్రీమీ డెజర్ట్), కేసర్ ఫిర్ని (తాజా పాలు, కుంకుమ పువ్వుతో తయారయ్యే సంప్రదాయ స్వీటు) ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన కుల్ఫీలు కేసరా పిస్తా కుల్ఫీ, హనీ ఆల్మండ్, డేట్స్ కుల్ఫీ ఈ విందుకు తీయటి ముగింపును ఇస్తాయన్నారు.

**IN THE COURT OF THE HON'BLE ADDL FAMILY COURT JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD**

I.A.NO.158 OF 2024
IN
F.C.O.P.NO.367 OF 2020

**Between:**

Joseph Bernardine Shalini

....Petitioner/ Respondent

**AND**

Gunde Praveen
R/o.H.No.3-36-155
Sanjeevaiah colony,
West Marredpally
Secundrabad-500 026

..Respondent/ Petitioner

Please take notice that in I.A.No.158 of 2024 in F.C.O.P.No.367 of 2020 has been file against you for committing contempt of court the said I.A. is posted on **14.07.2025** for your appearance, you have to appear in person or though your Counsel failing which the matter would be decided as per Law.

"BY ORDER OF COURT"

Counsel for the Petitioner/Respondent

**Imran Mahmood**
**Muneer Jahan**
Mahmood and Co Adv
Mahmood complex,
1-7-347 to 349
Suite 'A' 2nd floor
Parklane
Secunderabad.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com